కథానిక :

# దాగిలి మూతలు

అ్రపంతా అనుకోకుండా అకస్మాత్తుగా జరిగింది. మధ్యాహ్నం నిద్రనుండిలేచి, ఆవులిస్తూ వెళ్ళి గోడనున్న అద్దంలో ముఖం చూసుకున్నాడాయన. నుదుటిమీద సన్నటి గీతలు, నల్లవెంట్రుకల మధ్యలో తెల్లవి, కళ్లకింద కాకిపాదం ఆకారం గీట్లు—నిజంగా కనబడినంత ముసలితనం, తనలో వుందా అని ఆశ్చర్య పడ్డాడు. ఉపాధ్యాయవృత్తిలో వారు వృద్ధులుగా కనపడతారంటారు. ఆ వుదయమే రామదాసు మాస్టరీ వుద్యోగానికి రాజీనామా యిచ్చాడు. ఇందుకు ఓ విధంగా సంఘాన్ని మరమ్మత్తు చెయ్యాలన్న ఉబలాటమే కారణం. స్కూలు నిర్వాహకవర్గంవారు, పాఠశాల అభివృద్ధికై పోగుచేయబడ్డ విరాళాలను తమ స్వంతానికి వాడుకుంటున్నారన్న సంగతి బైట పెడతానని బెదిరించాడు. అందుకు సమాధానంగా నాస్తికత్వం, స్వేచ్ఛాప్రేమ బోధించి పిల్లల్ని పాడుచేస్తున్నాడన్న మిషపై యీయన్ని ఉద్యోగంనుండి తొలగించడానికి నిర్వాహకవర్గంవారు సమకట్టారు. ఈతని దగ్గర తన ఫిర్యాదు రుజువుచెయ్యగల బలమైన నిదర్శనా లేవీలేవు. ఇదివరకే తన వింత భావాలపైనా అభిప్రాయాలపైనా వ్యాఖ్యానాలున్నాయి. ఇప్పుడు వెర్రివాడుగా చెప్పుకుంటున్నారు. ఏ కొద్దిమంది విద్యార్థులో తప్ప తన వాదాన్ని బలపరిచేవారు లేరు. రామదాసుకి రాజీనామా యివ్వక తప్పిందికాదు. అతని వయస్సు నలభై ఎనిమిది కావొచ్చు. కాని యింక స్కూలు మాస్టర్ని మాత్రం కాను, అమ్మయ్య అనుకుంటూ అద్దంలో బింబాన్ని వెక్కిరించాడు.

గది మూలనున్న పాత కర్రపెట్టి అద్దంలో కనిపించింది. వెళ్ళి ఆ పెట్టితెరచి అందులో వొస్తువుల్ని పరిశీలించ సాగాడు. వివాహమైన కొత్తలో తను కల్యాణికి వ్రాసిన వుత్తరాలు కొన్ని చూశాడు. ఒకదాన్ని తీసి చదివాడు. ఆనాటతనిలో వున్న శృంగార శక్తులు, రసికత్వం ఆశ్చర్యం కలుగజేశాయి. అదంతా వృథా,

కల్యాణిలో ప్రేమోద్రేకం శూన్యం. తన కేమీ పట్టనట్లు, అక్కర్లేనట్లూ యితనివద్దనుంచి ఏదో కొంత దాచినట్లు వుండేది. నిష్కారణంపై మంచుకణం పడినట్లు యితనిలో పుద్వేగం చప్పబడి మెల్లిమెల్లగా అనుమానానికి దారి తీసింది. ఆరుసంవత్సరాల దాంపత్య జీవితం అసూయతో నిండిపోయింది. ఆమెకి సంతానం కలగకపోవడం, యితని చికాకుకి మరో కారణం. అతనిలో లోటు తెలుసుకోవా లంటే మరో పెళ్ళి చేసుకోవాలి. ఇద్దరిభార్యలతో కాపరం మాటలు కాదు. రామదాసు వయస్సు అప్పటికి ముప్పై రెండు. ఆ వీధిలోనే మరో అమ్మాయితో స్నేహం కుదిరింది. ఈ విషయం భార్యతోచెప్పి వేశాడు. ఆమె తగవులాడేది. ఆమెపై అతనికున్న అధికారానికి చిహ్నాలుగా వుంటున్న యీ తగాదాలు అతనికి సంతోషాన్ని కలగ జేసేవే అనాలి.

కొద్దినెలల్లో కల్యాణి న్యుమోనియా వ్యాధికి గురైంది. పరా మర్శించడానికి వొచ్చిన బంధువుల్ని స్నేహితుల్ని చూస్తే రామదా సుకి మండిపొయ్యేది. వాళ్ళల్లో ఎవరో వొకరితో ఆమెకి చెలిమి ఏర్పడి వుండాలి. ఎవరో తెలుసుకోలేక పిచ్చెత్తినట్లుగా వుండేది. కొన్ని రోజుల్లో కల్యాణి చనిపోయింది. మళ్లా పెళ్ళికి స్వతంత్రుడే కాని, ప్రేమించిన పిల్లకి మరొకరితో వివాహం జరిగి కాపరాని కెళ్ళిపోయింది. ఇదంతా జరిగి పదిహేను సంవత్సరాలైంది. అతను మళ్ళా ప్రేమించడం జరగలేదు. వొంటిగా జీవితం గడుపుతూ, విషా దంలో వొక వెర్రి ఆనందాన్ని అనుభవిస్తూంటాడు. అతని వైవాహిక జీవనం భగ్నమయింది గనక వివాహంలో విసుగుతప్ప మరేమీ లేదంటాడు.

మిగతా విషయాలపై అతని అభిప్రాయాలు, అనుభవాన్ని అనుసరించే వున్నాయి. దేశంలో జనాభాన్ని పెంచడమే కాకుండా, సంతానం యాతనంటాడు. పురుషులంతా దగాకోర్లు, స్త్రీలంతా చెడ్డవాళ్లు. ఈ వెర్రివిపరీత పరిణామం పొందకుండా ఉపాధ్యాయ

వృత్తిలో నిమగ్నుడై అంతర్యాన్ని దిగమింగ గలిగాడు. అపనమ్మకపు సిద్ధాంతాలు అతనిబోధలకి పదునిచ్చాయి.

ఉత్తరాలు పెట్టేసి, రామదాసు ఫొటోగ్రాఫ్‌ల ఆల్బమ్ తీశాడు. అదిఎవరో యిచ్చిన పెండ్లిబహుమానం. పెళ్ళినాటి ఆపటం చూస్తే అతనికి దిగులేస్తుంది. అప్పుడు సన్నగా నాజూకుగా వుండేవాడు, అతనే యితనంటే స్నేహితులు ఆశ్చర్యం ప్రకటించేవారు. గోడనుంటే చూసేవారు యిట్లాంటివనడం, తనుబాధపడటం జరుగుతుందని, దాన్నిలోపల పెట్టేశాడు. అతను, పదిహేనేళ్ల వయస్సులో తీసుకున్న మరో ఫొటోవుంది. అమాయకంగా కనపడే పెద్దకళ్ళు అవి - విద్యార్థి దశలో ఫొటో అది. అమాయకత్వంతో వొచ్చే ప్రశాంతత అతని మనస్సులో లేకపోవడం చిత్రంగాతోస్తుంది.తనేదో పాపం చేశానన్న స్ఫురణ పదేపదే అతన్ని అవహిస్తుంది. అది చాలా స్వల్పవిషయం. కల్యాణి న్యుమోనియాతో మంచాన పడినప్పుడు, వైద్యుని రప్పించడంలో కాస్తంత ఆలస్యమైంది. జబ్బుఇల్లా పరిణమిస్తుందని ఆతననుకోలేదు. ఆమెకూడా ఫరవాలేదంది. డాక్టరు యీ ప్రస్తావన తేలేదు, ఆమె చనిపోయింది - అందుకతను బాధ్యుడన్న అనుమానం వొదలదు. గిట్టనివారు కొందరు భార్యపోవడం ఏర్పాటుగానే వుందన్నారు. ఈ అనుమానాన్నుండి పారిపోలేడు. ఆల్బమ్ మూసేసి, దానిపై ఏదేనా కప్పుదామని లోపల తడుముతుంటే, నాటకం దుస్తులు బైటపడ్డాయి. చిన్ననాటి నాటకాల సరదాల్ని జ్ఞాపకంచేసే సరంజామ అదంతా. మస్లిన్‌లో కుట్టిన రాజువేషంకోటు, మంత్రివేషం పాగా, మునివేషం కాషాయిజుబ్బా, గడ్డాలు - యివన్నీ మాసి, చినిగి అల్లాగే వుండిపొయ్యాయి. పాఠశాల వార్షికోత్సవం నాడు పిల్లలు నిర్వహించే నాటకాలు అతను చూసేవాడు. అతనూ అప్పుడప్పుడు వోవేషంధరిస్తుండేవాడు - నారదుడు, అతని అభిమాన పాత్ర. రామదాసు తనుగొప్పనటుడై పోవాలనుకునేవాడు. నటుడికి కావల్సిన లక్షణా లతనిలో వున్నాయని నమ్మకం. ఆతనిజీవితమంతా వొకనటనగా పరిణమించింది. ఆ నటనలో పూర్తిర్ణుడయ్యా

డేమో కాని, రంగస్థలంపై కాలేదు. ఎందుచేతనో. భార్యపోయింతర్వాత, యోగిగా ఊహాలసుకునేవాడు. రైల్లో వోమారు 'యోగి' బృందంతో గోష్టిసలిపాడు. పరమాత్మని సందర్శించినప్పుడు కలిగే మహత్తర ఆనందంగురించి, వైరాగ్యంలోనిప్రశాంతతనిగూర్చి, హిమాలయాలలో తపస్సువల్ల పొందే వెలుగునుగూర్చి వారు ప్రస్తావిస్తుంటే, అతను బుద్ధుడు, రామకృష్ణ పరమహంసనీ స్మరించి, వూహించుకున్న సంతోషంలో మునిగేవాడు. రైలునిలబడగానే, టిక్కెట్లులేకుండా ప్రయాణం చేసినందుకు, రైల్వేవుద్యోగి ఆయోగి బృందాన్ని దింపితీసుకుపోవడంతో అతని పగటికల కరిగిపోయింది.

అనుకోకుండానే, రామదాసు ఆ కాషాయవస్త్రాన్ని ధరించాడు, మొహానికి గడ్డాలు తగిలించుకున్నాడు. సమాధిలో వున్నప్పుడు యోగిచేతికింద వుంచుకునే కర్రని తీసుకుని మరోగుడ్డ పాగా చుట్టి, అద్దంలో చూసుకున్నాడు. ఆ దుస్తులు బాగా అమిరాయి. కళ్లలో దీనత్వం, ముడివడిన కనుబొమ్మలు, గంభీరంగా ముడుచుకున్న పెదవులు, తెల్లవెంద్రుకలలోని పరిపక్వత - అన్నివిధాలా యోగిలావున్నాడు.

నిజంగా ఇది ఇతనికి తగ్గవేషం, నిజతత్వంకూడా ఇదే. చటుక్కున రామదాసుకి ఒక ఆలోచన తట్టింది. ఈ దుస్తులతో వీధిలోకెళ్లి, సంఘాన్నిచూస్తే ఎల్లా వుంటుందో ...! అదొక అపూర్వమైన మానసికానుభవం. నిజమన్నట్లుగా గడియారం మూడు కొట్టింది. పనిమనిషితో తనింక ఆపూటకి రానక్కర్లేదని చెప్పాడు. మధ్యగదిలోపల గడియవేసి, దొడ్డివైపు గదికి తాళంవేసి, వీధిలో అటూయిటూ చూసిఎవ్వరూ తనని చూళ్లేదని తేల్చుకుని బైటకి నడిచాడు. నాలుగడుగులు ముందుకేసి ఇంటికేసి, అదే ఆఖరుసారి చూసినట్లుగా, పరకాయించిచూసి, తొందరగా నడవడం సాగించాడు. పెద్ద రస్తాకి చేరుకున్నాడు. వీధమ్మటనడిచే వ్యక్తులకేసి చూస్తుంటే తనేదో దూరంగా ఎత్తుమీదనుండి చూస్తున్నట్లనిపించింది, పాకుతూ.

మెల్లిగా ఈడ్చుకుంటూ కదిలిపోతున్న దౌర్భాగ్యపు మానవులు వారందరూ - ప్రతి వ్యక్తి మనోవ్యాధి మేఘంలో మరుగుపడ్డాడు. ఇంటికి తొందరగా వెడుతున్న అతను బ్యాంకు గుమాస్తా – ఇల్లు, మరో బ్యాంకు, భార్యకి మంచం అవతలనిలబడి ఈ డబ్బుకాస్త దాఖలు చేసుకుంటాడు; ఆ కార్లోపై వుద్యోగంకోసం పన్నాగం పన్నుతున్న ప్రభుత్వోద్యోగి కోర్కెలు సిద్ధించినకొద్దీ వారి ఆశ యాలు పెరిగి, చివరకి మేఘం బ్రద్దలై పొందిన ఫలితాల్ని ముంచెత్తి వేస్తుంది.

రామదాసు పార్కు దగ్గరికి చేరుకున్నాడు. కొందరు పిల్ల లాడుకుంటున్నారు- మరికొందరు వొస్తువులు అమ్ముకుంటున్నారు. ఇద్దరుసాధులు గంజాయి పడుతున్నారు. వారిఎదుట పడకుండా,చెర చెరానడిచి కాలవగట్టుకి చేరుకున్నాడు. గట్టున గుడిసెలున్నాయి, చెట్టునీడని స్త్రీలు బుట్టలల్లుతున్నారు. తొందరగా నడిచి ఏకాంతంగా వున్నచోటుకి చేరుకున్నాడు. ఎవరో అతని వెనక నడుస్తున్నట్లనిపించి తిరిగిచూశాడు. నడివయస్సులోవున్న వొకవ్యక్తిదీనంగా నమస్కరించి పలకరించాడు.

విచారంతో అతని ముఖం వాడినట్లుగావుంది ; బుజానవున్న తువ్వాలుతో కళ్ళల్లో తడిని తుడుచు కుంటున్నాడు. అతన్ని పలక రించాలేమో, రామదాసుకి చటుక్కున తట్టిందికాదు.

"ఎవరు నాయనా నువ్వు - దిగులుగా వున్నట్లున్నావు?"

" అవునుస్వామీ - నన్ను మీ వెంట తీసుకుపొండి. "

" ఎక్కడికి?"

"ఎక్కడికైనా సరే మీరు హిమాలయాల్లో వుంటుంటారు."

కొంచెం నిదానించి, రామదాసు " అవును " అన్నాడు.

" మిమ్మల్ని వదికోరను, ఎక్కడికో దూరంగా ప్రశాంతమైన నిర్జన స్థలానికి తీసుకు వెళ్లండి "

" కారణం? "

' నాకు జీవితమంటే విసుగెత్తిపోయింది.... "

రామదాసు కారుణ్యం సూచిస్తూనవ్వాడు.

"జీవితమంటే యింత మోహం మొత్తడానికి నీకు జీవితం గురించి ఏంతెల్సు నాయనా?" అన్నాడు రామదాసు.

" సంసారం త్యజించి, ఇంట్లోంచి లేచిపోవాలనిపించేటంతగా జీవితంగురించి తెల్సు స్వామీ - నేను తిరిగి వెళ్లను. మీతోవచ్చేస్తాను." అన్నాడా వ్యక్తి. అతన్ని శిష్యుడుగా దేశపర్యటన దృశ్యంవూహించి గగుర్పాటు చెందాడు రామదాసు. సరియైన వాక్యంకోసం యోచిస్తుండగా, ఆవ్యక్తి తన కుడిచేతిని పైకెత్తి చూపించాడు.

' హిమాలయాలనుండి వొచ్చిన స్వాములుమీరు - చెయ్యిచూసి నా విషయం చెప్పండి "... అన్నాడు. రామదాసు చకితుడయ్యాడు. చెయ్యిచూసి చెప్పడం రాదంటే? అరచేతిని మృదువుగావొత్తి " నీకు గొప్పభవిష్యత్తువుంది " అన్నాడు. అట్లాగంటే ప్రమాదంలేదు.

" లేదు స్వామీజీ - నాకు భవిష్యత్తు లేదు. దుర్భరమైన గతం మిగిలింది. సర్వమూ త్యజించి నేనుమీతో వొచ్చేస్తాను." అని ఆవ్యక్తి గట్టుమీద దిగాలుపడి కూర్చుని, మొహాన్ని చేతుల్లో దాచుకున్నాడు. పక్కనకూర్చుని భుజాన్ని తట్టుతూ, రామదాసు అతన్ని వోదారుస్తున్నాడు.

" ఏమీ తెలియని పసివాడివి నాయనానువ్వు " అన్నాడు అతను తనవేపు చూడనప్పుడు. మాటలు సులువుగా వోస్తున్నట్లు గ్రహించాడు.

" త్యజించవల్సిన వయస్సు నీకింకాలేదు. ఈ విషయాలను గూర్చి అప్పుడే ఆలోచింపకూడదు. ఇంటికివెళ్ళి, భార్యాపిల్లల్ని చూసుకుంటూ, వారి ప్రేమానురాగాలకుపాత్రుడవై యధోచితంగా సమాజ

సేవచెయ్యి నాయనా. పారిపోవడంవల్ల సృష్టిలయని భంగంచేస్తు న్నావు." అన్నాడు ... నిజంగా పిట్లకేమన్నా అర్థముందా అను కుంటూ. జీవితంగూర్చి వ్యాఖ్యానించి సిద్ధాంతీకరించడంకంటె సుళు వైంది మరోటి లేదనిపించింది. అనేకమార్లు యీ సిద్ధాంతాలను పెద్దలు ప్రస్తావించగా విన్నాడు. ఎన్నోమార్లు పీటినిగురించి చదివి యివన్నీ ఏగా అనుకునేవాడు.

"అవును నాయనా - యీ చికాకు క్షణికమే. బాధ కాసేప టికి ఉపశమిస్తుంది. ఈ జీవితం వొకరంగస్థలం. ఎప్పుడూ ఎవరో ఒకరు దీనిపైవుంటూనే వుంటారు. నీపాత్ర నువ్వు నిర్వహించాలి. ఎన్నెన్నో ఘనకార్యాలు నువ్వు సాధించాలి. ఎన్నెన్నో కలలుకన్నావు, నీ పిల్లలద్వారా ఆ స్వప్నాలు నిజమవుతాయి. నువ్వు కొంతసాధించి విడిచి పెడతావు. అక్కడ వారందుకుంటారు. సృష్టి నిత్యమూసిద్ధి పొందుతూనే వుంటుంది."

ఆ వ్యక్తి మొహంపైకెత్తి కాలవకేసిచూశాడు. మళ్ళా కిందికి దించి మోకాలుమీద ఆనించాడు.

"లేదు - నాకీజీవితంలో ప్రేమలేదు."

"చెప్పు నాయనా చెప్పు, నిదానంగా చెప్పు."

"తల్చుకుంటే బాధగా వుంటుంది. నేచెప్పలేను స్వామీ..."

"లేదునాయనా ఇతరులతో పంచుగుంటేబాధ ఉపశమిస్తుంది నిన్ను వోదార్చి మనశ్శాంతి గలగచేస్తానేమో యత్నిస్తాను. జీవి తంలో సమాధానం కుదిరేటట్లు చెయ్యగలనేమో - నీ వృత్తాంతం చెప్పవు?"

"మీరు మహానుభావులు. పవిత్రమైన మీ మనస్సుని యీతుచ్ఛ మైన ప్రేమగాథతో కలవరపెట్టలేను. మీ ముందు అల్పుడను కాలేను."

"కాదు నాయనా—అప్పుడవు కాదు. భగవంతుని దృష్టిలో అందరూ సమానులే. పరమాత్మ అన్నిటిలోనూ వున్నాడు. తుచ్ఛమైన ప్రేమలోకూడా—మీరందరు సిగ్గు పడాలని వుంది." అన్నాడు రామదాసు.

ఆ వ్యక్తి కాలవలో చిన్న చిన్న రాళ్ళు విసురుతూ తన కథ చెప్పడం సాగించాడు. "పెద్దవాళ్ళు ఏర్పాటు చేసిన, సాధారణమైన వివాహం మాది. పిల్లని చూశాను. నచ్చింది. నా వయస్సు ఇరవై నాలుగు, ఆమెకి పదహారు. కార్యమవగానే చదువుకోసం కాలేజీ కెళ్ళిపోయ్యాను. చదువు పూర్తిచేసుకుని ఎనిమిది నెలలకి తిరిగొచ్చాను, ఆమె పండంటి మొగశిశువును కన్నది. హరి అని నామకరణం చేశారు. నాకు ఉద్యోగం దొరికింది. హాయిగా కాపరం చేస్తున్నాం. ఐదేళ్లతర్వాత మా రాధ పుట్టింది. హరి ఎప్పుడూ తల్లితోనే వుండేవాడు. రాధకి నా దగ్గర చనువు. రాధ అచ్చంగా నా పోలికే అన్నాడు వో స్నేహితుడు. హరికి ఎక్కడా నా పోలికలేదని అప్పుడు గుర్తించాను. అసలు మాకుటుంబంలో ఎవ్వరిఛాయలూ వాడిలోలేవు. వాడు నాకు పుట్టలేదన్న వొక పెద్ద అనుమానం పుట్టింది నాకు. పెండ్లయి పదినెలలేనా కాలేదు. నేను తండ్రినయ్యానన్నారు...."

ఆ వ్యక్తి మౌనం దాల్చాడు.

"ఇంతేనా నెలలవకుండానే ప్రసవించడమనేది వుంది...." అన్నాడు రామదాసు. ఎందుకన్నానా అని పెదవి కొరుక్కున్నాడు, ఆ వ్యక్తి వినిపించుకోనట్లుగా మళ్ళా సాగించాడు.

'కాని పోలికల మాటేమంటారు.? రోజులు గడచినకొద్దీ నా అనుమానం దృఢపడసాగింది. బంధువుల్ని, స్నేహితుల్ని పోలికల కోసం గాలించసాగాను. ఋజువు లేకుండాఆమెపై నిందమోపే సాహసం నాకులేదు. చిత్రం, నా అనుమానంతో పాటు, ఆమె

ప్రేమానురాగాలు ఎక్కువవుతూ వొచ్చాయి. ఇదంతా నన్ను మరి పించడంకోసం చేస్తున్న నటన అనుకునేవాడిని. ఛాయగా ఎత్తి పొడుస్తూ నా అనుమానం బైటపెట్టేవాడిని. రాద్ధాంతాలయ్యేవి. ఇవన్నీ అన్యోన్యానురాగం సూచించేవొట్లతోనూ, ప్రమాణాలతోనూ ముగిసేవి... కాని... కాని"

తడితో కళ్ళు బరువెక్కి అతడు చెప్పలేకపొయ్యాడు. మెల్లగా తేరుకున్నాడు.

" ఈ మధ్యాహ్నం నిజం కనుక్కున్నాను.'' అని నిట్టూర్చాడు.

"విపులంగా చెప్పు నాయనా...."

''నాకింక అనుమానం లేదు- హరి తండ్రీ లక్ష్మీపతి. చిన్నప్పటి నుంచీ మేమిద్దరం స్నేహితులం. ఒక వూళ్ళో కొన్ని సంవత్సరాలు పనిచేశాము. నా పెళ్ళినాటికి, మేమిద్దరం వోవూళ్ళోనే వున్నాము. తరవాత కొన్నాళ్ళకి బదిలీ అయి అతను మరోచోటికి వెళ్ళిపొయ్యాడు. ఉత్తరాలు వ్రాస్తూండేవాడు. మొన్న మమ్మల్ని చూసి పోదామనొచ్చాడు.

హరిలో అతని పోలికలున్నాయి. ఉన్న రెండు రోజులూ, ఆ విడకూడా మాతో కలిసి సంభాషించేది. నా కర్థంకాని ఆంతరంగికం వాళ్ళ మధ్య వుండేది. మళ్ళా మాటల్లో నాకేమీ దొరకలేదు. ఒకొరికేసి వొకరూ, యిద్దరూ కలిసి నాకేసీ—చూసే చూపుల్లో నాకేదో కనిపించింది.''

రామదాసు అప్రయత్నంగా నవ్వాడు.

"మనో చాంచల్యానికి, భ్రాంతికీ యిది మంచి ఉదాహరణ— స్నేహితుల్ని యీ విధంగా ఉపయోగించుకుంటున్నావా, నాయనా ?" అన్నాడు.

"అంతేకాదు స్వామీ. ఈ ఉదయం లక్ష్మీపతి వెళ్ళాడు. అతన్ని దిగవిడచి నే ఇంటికొచ్చేసరికి మధ్యాహ్నమైంది. రాధ నిద్రపోతోంది. హరి యింకా స్కూలునుంచి రాలేదు. హాల్లోంచి లోపలికెళ్ళి పడకగది తలుపులు తెరిచాను. ఆమె అదిరి పడింది. తలంటు పోసుకుని, సదో చూస్తూ కూర్చుంది. నన్ను చూసి బెదిరి నట్లు చివాలున లేచి చేతులో వున్న కాగితాన్ని గుప్పెట్లో ముడి చేసి కొంగులో చెయ్యి దాచింది. జుట్టు గాలికి కదులుతూ మెడ చుట్టూ పడింది. శరీరానవున్న తడి చీరని గొద్దిగా పట్టుకుని వుండ డంమూలాన గుప్పెడుకనిపిస్తోంది.

"ఏమిటది ?"....నా ప్రశ్నకి ఆమె వులిక్కిపడింది.

'ఏమీ లేదు.'...కంఠంలో దౌర్బల్యం ధ్వనించింది.

'ఏమిటో నాకు తెలుసు' అన్నాను.

'అవుతే నన్నడగటం దేనికి?'

'నే అనుకున్నది సరో కాదో చూద్దామని.'

'ఏమనుకున్నారో ముందు చెప్పండి.'

'చెప్పను.'

'చెప్పకపోతే యిదేమిటో కూడ చెప్పను.'

ఒకడుగు ముందుకేసి... 'ఆగుప్పెట్లో దేమిటోయిల్లాతే' అని గర్జించాను.

'నేనివ్వను' అని రెండడుగులు వెనక్కివేసింది.

'నేను బలవంతంగా తీసుకోగల్ను తెలుసా'

'అబ్బే...'

'విసిగించక యిల్లాతే - ఊ -' అంటూ దగ్గరకెళ్ళి మోకాలు మీదికి జారిన ఆమె చీరకొంగు పట్టుగున్నాను.

'దూరంగా వుండండి - వెళ్లండి' అని కొంచం బిగ్గరగాఅంది

" ఎందు కివ్వవు?"

" మీకి పట్టుద లెందుకు?"

"నాకంతా తెలుసు కాబట్టి..."

" ఏమిటా వెర్రిధోరణి...మీ కేం తెలుసు!"

నా కేం తెలుసో నీకు తెలీకపోతేగా?"

" నా కేం తెలీదు." అన్నదామె.

" మొగుడికి చివ్వర్లో కాని తెలీదంటారు !" అన్నాను.

" ఆహా " అని కాస్త వెటకారంగా అని హిస్టీరియా అనిపించే అదోరకంనవ్వుని నిలుపుకుంటోంది.

" చివ్వర్లో తెలిస్తే చివర్లోనే నమ్మాలికూడ" ... అని ముగిం చింది. పూనకంలా వొచ్చేసింది నాకుకోపం. ఆమె నోటిమీద చేత్తో వొక్కటిచరిచాను, చేతులోవున్నదాన్ని లాక్కోడంకోసం. పెనుగు లాట సాగించాను. పట్టువొదలక, మంచంబద్దీ పట్టుగుని నన్నొక్క తోపుతోసింది. నేను మంచంపైనకూలాను. వెర్రి ఆవేశంలో కొట్ట డానికి ఏదేనాదొరుకుతుందేమో చూస్తూ హాల్లోకెళ్ళి పింగాణీపూల తొట్టిని విసిరేశాను, అప్పుడే వొచ్చి గదిలో కెళ్ళబోతున్న వారికి తగి లింది. అమ్మయ్యో అనివాడు కూలడం, నే నెళ్లబోతుంటే తలుపులు లోపల గొళ్ళెమెయ్యడం జరిగింది. 'పో ఇక్కడికి రాకు పో' అనివాడు గొణగడం అస్పష్టంగా వినిపించింది. కొండ శిఖరంనుండి పడినవాడి లాగైంది—అఖాతంలోకి కుంగిపోతున్నట్లుగా, అల్లా నడుచుకుంటూ యిల్లా చేరుకున్నాను. స్వామీ—మీరే నన్ను చూడాలి.''

ఉద్రేకంతో ఆ వ్యక్తి పెదవులు వొణికిపోతున్నాయి. పొరలి వొస్తున్న దుఃఖం మొహాన్ని వికృతంగా చేసింది. రామదాసు అతని మొహాన్ని తుడుస్తూ బుజ్జగించాడు. అతని కళ్ళల్లోకి తీక్షణంగా చూశాడు.

"చూడు నాయనా, 'నేనిది చేశాను,' 'నే నది చేశాను' అంటావు. ఈ "నేను" ఎక్కడుంది? లేదు నాయనా. ఆకలేస్తే అన్నం కావాలంటావు. చక్కలి గింత పెడితే నవ్వుతావు. గిల్లితే ఏడుస్తావు మిగతవాళ్లు ఎవ్వరూ చెయ్యనిది, ప్రత్యేకంగా నువ్వుమాత్రం చేసినది, యిందులో ఏదుంది? అహాంని మరచిపో—కన్నీటికి, నవ్వుకీ అతీతుడ వవుతావు....నీ అహంగురించి ఆలోచించి, దాన్ని ప్రేమించి తుదకు ద్వేషిస్తున్నావు. అందుకనే అహంనుండి పారిపోతున్నావు. నువ్వు నీ భార్యనీ, పిల్లవాడినీ ద్వేషించడం లేదు. నిన్ను నువ్వే ద్వేషించుకుంటున్నావు. హరి గాయపడేటట్లు నువ్వు విసిరిన పూల తొట్టి నీ పైననే విసురుకున్నావు. గాయపడి పరుగెత్తుకొచ్చేశావు"....ఈ సందర్భంలో ఏదేనా వో శ్లోకం చదవాలనుకున్నాడు రామదాసు, కాని తప్పులు చదవడం అతనికి యిష్టంలేదు.

" నే నామెను ప్రేమించాలనుకున్నాను. శీలం చెడిపోయిన స్త్రీని ప్రేమించలేను స్వామీ...."

రామదాసు చిరునవ్వు నవ్వాడు.

"పిచ్చివాడవు నాయనా .... నువ్వామెను ప్రేమించలేదు, వాంఛించావు. వయస్సు మళ్లడంతో వాంఛ నన్నుగిల్లుతుంది. వాంఛ లేనప్పుడు సాధ్యమైన ప్రేమే—నిజమైన ప్రేమ."

"సంతోషం లేనప్పుడు యీ ప్రేమ ఎందుకు స్వామీ....

"ఈమాత్రం తెలీదా? నువ్వు అన్వేషిస్తున్నది ఆనందం కాదు. నువ్వు కోరేది కొత్త కొత్త ఇంద్రియానుభవాలు, వయస్సుతోపాటు శారీరక సుఖాలు పల్చబడతాయి. హృదయం పవిత్రమైన ప్రేమతో నిండుకుంటుంది. సంసారాన్ని త్యజించడానికి నువ్వు సంసిద్ధుడవేగా?

"ఆ...."

"సరే ఇప్పుడు నీ హృదయం లోపల చూడు. అసూయ. ద్వేషం వున్నాయా? "

"అవును స్వామీ—నాకు తెలిసొస్తోంది. మనస్సులో ఆరాటం తగ్గుతోంది."

"నిన్ను గురించి ఆలోచించకు. నీ భార్యను గురించి పిల్లల్ని గురించి ఆలోచించు. వారిని ప్రేమానురాగంతో ముంచివెయ్యి. వారిని సుఖపెట్టు. నువ్వు సుఖపడతావు. ఇదే వేదాలు బోధించే రహస్యం."

"ఇది నాకెల్లా సాధ్యమో చెప్పండి?"

"ఎందుకు కాదు? నీ భార్య గుప్పెట్లో వున్నదేమిటో నువ్వు చూడలేదు. అది మామూలు కాగితం కావొచ్చు, ఏనాడో నువ్వామెకి వ్రాసిన జాబు అవొచ్చు. పాత జాబులు ఎంతో ఆనందాన్నిస్తాయి. ఆ జాబుని ఆమె చదువుతూ వుండొచ్చు"

'అవుతే ఆమె నాకెందుకు చూపించదు?'

"చూడు నాయనా—ఆమెకి నీ లాగే అహంవుంది. నీ అహాన్ని నువ్వు ప్రదర్శించావు. ఆమె తన అహాన్ని బైట పెట్టింది. నీ దౌర్జన్యం, మూర్ఖత్వం, ఆమెలో దౌర్జన్యాన్ని, మూర్ఖత్వాన్ని పురిగొల్పాయి. రహస్యమైన స్వార్థాల సంఘర్షణ అది, తిరిగి ఆమె దగ్గరకు వెళ్లు, నీ మూర్ఖత్వాన్ని తెలియపరిచి, పశ్చాత్తాపపడి, ఆమె క్షమాపణ వేడుకో. ఆమె హృదయ ద్వారాలు తెరుచుకుంటాయి. విశ్వాన్ని సహితం ముంచివేసే ప్రేమ నీపై కురిపిస్తుంది."

"మరొకరికి పుట్టినవాణ్ణి నేనెట్లా ప్రేమించగలను స్వామీ?"

"మనమందరం దేవుడిబిడ్డలం. మరొకరికి పుట్టినాసరే, నువ్వు ఆ బిడ్డని ప్రేమించగలగాలి."

"నేనది చెయ్యలేను."

"నువ్వు చెయ్యగలవు. పరిస్థితులకు లొంగి, ఆమె అజ్ఞానంలో, అపచారంచేసి వుండొచ్చు. ఆమె గతాన్ని క్షమించు. మంచిగా ఉం

డేటందుకు వొక్క అవకాశమిప్వు. పుట్టిననాటినుండి, చనిపొయ్యే వరకూ మంచిగాఉండే వ్యక్తులు మనలో ఎవ్వరూ లేరు. అజ్ఞానంలో యౌవనచాపల్యంలో, మనం తప్పు టడుగులు వేస్తాం. పొరపాట్లు చేస్తాం - అప్పుడప్పుడు బోర్లగిల పడతాము. లేచి సర్దుకుని, మళ్లా బ్రతుకుసాగిస్తాం. నా కళ్ళల్లోకిచూడు. ఆమె అపచారం చేసిందం టున్నావు. అట్లాంటి అపచారం నువ్వెన్నడూ చెయ్యలేదా -నీలో నువ్వు ఆప్రశ్న వేసుగో..."

" కాని నేను పురుషుణ్ణి...''

" ఆమె స్త్రీ - పైగా మాతృత్వంద్వారా పరిపూర్ణత పొంద వల్సిన భారం ఆమెపైనుంది."

" స్వామిజీ మీరు చెప్పింది నిజమైతే, అసలునీతికే తావులేదు."

" ఇదొక వెర్రి నాయనా. వ్యభిచార మొక్కటేదుర్నీతికాదు. అసత్యం, దగాకోరుతనం, అన్యాయం, లంచగొండితనం, అధికారం, అసూయ, ద్వేషం, పగ, యుద్ధం-ఎన్నెన్నోవున్నాయి యీలోకంలో, ఇదంతాదుర్నీతే. దీనిని నువ్వు ద్వేషించి సమాజంనుండి పారిపోవడం లేదే....సాధించి భాగ్యవంతులైన వారిపట్ల వీటిని ఎందరో హర్షించ డమే కాకుండా ఆదర్శంగా స్తుతించడంలేదా? వెక్కిరింపుగా మృత్యు వులో అంతమొందే యీ క్షణిక జీవితంలో యిదొక అపరాధమా? అనంత విశ్వంలో, ఎడతెగని సృష్టిసమరంలో, ప్రేమలో పరాకుగా కన్ను మూతొక పాపమా! ... నేనొకన్నెరుగుదును..."...

ఏదో చెప్పబోతూ రామదాసు పొరబాటు తెల్సుకుని, చటు క్కున్న నిలిచిపొయ్యాడు.

" చెప్పండి స్వామీ - గొప్ప అనుభవం వున్నవారల్లే మాట్లాడు తున్నారు."

"లేదు నాయనా నాకేమీ అనుభవంలేదు. కాని ప్రేమంటే నాకు తెలుసు - విశ్వమంత గంభీరంగా, సృష్టంత శాశ్వతంగావుండ గలదు."

రామదాసు కళ్లు తడిసి మెరుస్తున్నాయి. నవ్వులోకిదిగిపోయి, ఆ వ్యక్తిని లేవదీసి ముందుకి నడిపిస్తున్నాడు.

"నాతో రా నాయనా...."

"ఎక్కడికి స్వామిజీ?"

"వైద్యునివద్దకి. అతన్ని తీసుకుని నీ ఇంటికివెళ్ళి, పిల్లడిని చూసుకో—

నిశ్శబ్దంగా నడవడం సాగించారు.

"తుమార్పణ, జీవితంతో సమాధానపడటం, ప్రేమ, విశ్వాసం యివి అర్థంలేని ధ్వనులు కావు నాయనా..." అంటున్నాడు రామదాసు. ఇంతలోగట్టునున్న గుడిసెల దగ్గరకి చేరుకున్నారు.

బీదతనం, అనారోగ్యం, ద్వేషం, యుద్ధం - అన్నిటికంటె ముఖ్యంగా ప్రేమరాహిత్యం - యివి నాయనా, జీవితంలో అనర్థాలు. వీటిని తొలగించడమే మానవజీవితంయొక్క పరమార్థం. నీ ప్రేమకోసం తహతహలాడుతున్న నీ భార్యా బిడ్డలదగ్గరికివెళ్లు.వారికి వుపచారం చెయ్యి. అదే పరమాత్మదర్శనం..."

ఇద్దరూ పార్కుదగ్గర కొచ్చారు. ఆ వ్యక్తి నేత్రాలు, ఉత్సాహంతో పదేపదే ముడుచుకుంటున్నాయి.

"మీరు మహానుభావులు స్వామీ - నాకుఅర్థమవుతోంది. నా మనస్సు చల్లగావుంది. ఇంకఅసూయ, ద్వేషమూలేవు...నేను ఇంటికి వెడతాను. వైద్యుని తీసుకెడతాను ... అయ్యో, హరిగాయపడి ఎంతగా ... బాధపడుతున్నాడో. ఆమెపాపం ... ఆమె యెంతగా స్వామీజీ, నేను మీకేమివ్వగలను?"

"నేను చేసిం దేమీలేదు నాయనా. ఇతరుల కోసం జీవించు. దైవం నిన్ను కాపాడుతాడు."

నెమ్మదిగా నడుస్తూ ఆవ్యక్తి పార్కు వెనక అదృశ్యుడైపోయాడు.

రామదాసు తనలో తాను నవ్వుకున్నాడు. జరిగిందంతా హాస్యాస్పదంగా తోచింది. వేదాంతం వేళాకోళమనీ, మనిషి పగాకోరనీ అనుకునేవాడు. ఆధ్యాత్మిక చింతనపైనా, దైవంపైనా అతని కెప్పుడూ గురికుదరలేదు. విశ్వాసంలేని అతనిపలుకులనుండి వోదార్పుపొంది, అతని మాటలు నమ్మి జీవితవిధానం మార్చివేసుకోటానికి సంసిద్ధుడైన వొక వ్యక్తి అతనికి తటస్థపడ్డాడు. మానవులు ఎంతటి అమాయకులు!.... గొప్పగా ధ్వనించే మాటలకీ, శూన్యమైన భావాలకీ లొంగి, మోసపోతారు.....తన భాషకీ, భావానికీ తనే ఉద్రేకపూరితుడై, హృదయంలో సంచలనంకలగడం గుర్తించి రామదాసు చీకాకుపడ్డాడు. నుదుటిమీద చెమట్లు కమ్ముతున్నాయి. పాగా తీసేసి, వొకపొరతీసి దానితో మొహం తుడుచుకున్నాడు. సూర్యుడు దిగిపోతున్నాడు. పొడుగాటి నీడలు పడుతున్నాయి. చెట్లు, వీధి, పడమటిఆకాశం - వీటిపైన సంధ్యవెలుగు ఎర్రశాలువా కప్పినట్లుంది. ఇద్దరు సాధువులు సంచీలు కట్టేసుకుని, కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ కాలవకేసి నడిచిపోతున్నారు. వారిలో వొకడు వెనక్కి తిరిగి తనకేసి చూసినట్లయింది. రామదాసు వెంటనే పాగాతగిలించి, పార్కు అవతలవైపుకు వెళ్ళాడు. కుళాయిదగ్గర మొహం కడుక్కొని కాసిని నీళ్లు తాగి ముష్టివాళ్లమధ్యగా నడచి పార్కులోపలికి చేరుకున్నాడు. అలసటగా వుండి, కాసేపు సేద తీర్చుకుందామనుకుని, వో మూల కర్ర బెంచీమీద మోకాళ్ళు ముడుచుకుని కళ్లు మూసుకుని కూర్చున్నాడు. కొన్ని నిమిషాలు గడిచాయి. ప్రతిధ్వనించే పిల్లలకేకలూ, నవ్వులూ వినబడ్డాయి.

పిల్లలతో ప్రమాదం, మరోసారిటుకి దూరంగా వెడితే మంచిదేమో అనుకున్నాడు. కాని వాళ్లు ఆటల్లో లీనమైపొయ్యారు. తనని గమనించినట్లు లేదు. వారి వయ్యారమైన పరుగులు, ముగ్ధగాలిపే నవ్వులు, చూడ్డానికి ఆకర్షణీయంగా వున్నాయి వారి సహజమైన సంతోషం. అతన్ని సంతోషపెట్టింది—చూస్తూ కూర్చున్నాడు. ఆకాశంలో ఎరుపు కరిగి, దట్టమైన ఊదారంగు మేఘాలు కమ్ముకుంటున్నాయి. ఫ్యాక్టరి కూత వినబడింది. పావురాలు చెట్లమీదికి ఎగురుతున్నాయి.

అతను లెక్క పెట్టాడు. ఆరుగురుపిల్లలు దాగిలిమూత లాడుకుంటున్నారు. పదారేళ్లుంటాయి—ఆ పిల్ల,దొంగ;కళ్లమీద రుమాలు కట్టివుంది. మిగతా ఐదుగురూ దొరకకుండా అటూ యిటూ పరుగెడుతూ, మొక్కలవెనక, బెంచీలకింద దాక్కుంటున్నారు. ఆపిల్ల చేతులు చాచి, తడుముల్లాడుతూ తిరుగుతోంది. రామదాసుకి దగ్గరగా వొచ్చింది, అతను లేవబోతుండగానే అతని భుజం పట్టుకుంది. "ఇడుగో దొంగ...దొరికాడు...అమ్మదొంగా—ఇక్కడున్నావా?" అని కేకలేస్తూ, మొహానవున్న రుమాలు లాగేసింది. మిగతా వాళ్ళందరూ నవ్వుకుంటూ ఆమెచుట్టూ మూగారు. "ఇడుగో దొంగ"... అన్నది ఆపిల్ల. మిగతా వాళ్ళందరూ, రామదాసుని అటూ యిటూ లాగుతున్నారు. అతని గడ్డాలు వూడి వొచ్చేస్తాయేమో నని భయపడ్డాడు, నిలబడి సర్దుకున్నాడు. ఆపిల్ల సిగ్గుపడి, ముసిముసిగా నవ్వుకుంటూ పరుగెత్తుకుపోయింది. మిగతావాళ్ళు ఆమె వెనకే పరుగులు సాగించారు.

రామదాసు పార్కు గేటు ముందుకి చేరుకున్నాడు. దూరంగా వో జట్కాబండి నిలిచింది. అందులోంచి, ఇందాకా ఇంటి కెళ్ళిన వ్యక్తి, వో కుర్రాడు దిగి. సన్నైపుకి నడచి వొస్తున్నారు.

స్వాగతానికే పీ రిక్కమంటారనుకున్నాను. అదుగో నా భార్య. రాధ; అదుగో ఆ బండిలో వున్నారు. పార్కు కేసి షికారుగా

బైలుదేరాము. మీరుంటారనుకున్నాము. ఆమెకి మీ దర్శనం చేసుకుని, ఆశీర్వాదం పొందాలనుంది. మీరు పారి. చిన్నగాయమే తెండి తగిలింది. వైద్యుడు బాండేజి చేశాడు. స్వామీ. మీరుచెప్పినట్లే జరిగింది స్వామండి! అంతా....ఎటొచ్చీ, చదువుతున్నది వృత్తరం కాదు. నే వెళ్ళేటప్పుడికి మా పెళ్ళినాటి ఫోటో చూసుకుని, జ్ఞాపకాలని పూహించుకుంటోందిట. నే పరాయివాడిగా ఆ జగత్తులో ప్రవేశించానట....నేను మూర్ఖుణ్ణి స్వామీజీ....ఆమెతో అంతా చెప్పేసి క్షమాపణ చేసుకొన్నాను. మీరు మహానుభావులు. క్షణం ఉండండి. వాళ్ళని తీసుకొస్తాను...." అంటూ సమాధానం చెప్పనీకుండా,అతను గబగబ బండిదగ్గరకు వెళ్ళాడు. అతని భార్య, కూతురు బండిదిగడం చూశాడు రామదాసు. మెల్లగా నడుచుకుంటూ వొస్తున్నారు. వారికేసి చూసి, చివాలున వెనక్కి తిరిగి రామదాసు నడవడం సాగించాడు. వాళ్ళు వొచ్చేసరికి అతను అక్కడ లేడు. వారిని అక్కడ దిగవిడిచి, ఆ వ్యక్తి పిలుస్తూ వెనకాలే నడచి వెళ్ళాడు.

"స్వామీజీ—వెళ్ళిపోతున్నారా....వాళ్ళని ఆశీర్వదించరూ?"

రామదాసు అతని కళ్ళల్లోకి చూశాడు.

"పరమాత్మ మిమ్మల్ని ఆశీర్వదిస్తాడు. నేను వెళ్ళాలి."

"ఎక్కడికి స్వామీ?"

"ఇంటికి...."

"ఇంటికా? మీకు ఇల్లు లేదన్నారుగా...."

"అవును నాయనా దేవుడే నాయిల్లు." అని రామదాసు తొందరగా నడిచాడు. పెద్ద రస్తాకి చేరుకున్నాడు. వెనక్కి తిరిగి చూశాడు, ఆ వ్యక్తి పార్కులోకి వెళ్ళడం చూశాడు. హరిని చూడగానే అతనే'దొంగ'ని రామదాసుకి తెలిసిపోయింది. పదిహేనేళ్ల విద్యార్థిగా వున్నప్పటి తన ఫోటో ఆ మధ్యాహ్నమే చూశాడు.

హరి ఆ ఫొటోలో పిల్లాడిలా వున్నాడు. 'దొంగ దొరికాడు' అన్న పార్కులో పిల్ల మాటలు అతని చెవులో గింగురుమంటున్నాయి. ఆపిల్లల నవ్వు పిలుపులు ముసురుకున్న అతని హృదయం పైన గుద్ది నట్లుగా వుంది. పిలుపులు పెరుచుకున్నాయి- వేదాంతం అంతా వేళాకోళం, మనిషి దగాకోరు అనుకునే వాడుగా......తను దగా కోరు; తన జీవితం వేళాకోళం; కళ్యాణిని ప్రేమించి క్షమించ మన గలిగాడా తను? స్కూలు వ్యవహారాలు బైట పెడతా నన్నాడు. నిర్వాహక వర్గం వారిపై ద్వేషం వల్ల కాదా? ఎవరిపై అతనికి నమ్మకం వుంది? తనమీద తనకే నమ్మకం వుందా? కళ్యాణి జబ్బుతో మంచాన పడినప్పుడు, వైద్యుని ఎందులకు వెంటనే పిలవలేదు? చని పోతే, తన బిడ్డని దాల్చిన ఆమెని పెండ్లి చేసుకుందామనేగా?

రామదాసు, తన యిల్లు వున్న వీధికి చేరుకున్నాడు. అడుగు నీరసంగా పడుతోంది, అస్థిపంజరం వొణుకుతోంది. కళ్ళమ్మట కన్నీరు కారుతోంది. ఆకాశంలో చందమామమీద సన్నటి పొరలా తెల్లటి మేఘం పడింది. నక్షత్రాల కేసి చూశాడు. చందమామ మీది మేఘం తొలిగింది. అతని మనస్సులో ఏదో తేలగా మెరిసినట్లయింది. వీధిలో జనం లేరు—మేడల కిటికీల్లోంచి, దీపాలు కదులుతు న్నాయి. ఇంటికి చేరుకున్నాడు. అదిగో అతని ఇల్లు—ఇన్నాళ్ళూ తను దాక్కున్న ఇల్లు. తనెప్పుడూ దాక్కుంటున్నాడు—ఇంట్లోనో స్కూల్లోనో గడ్డాల వెనకనో; ఇప్పుడు దొరికిపోయ్యాడు. ఇంక దాక్కోలేడు.

ఆకస్మికంగా రామదాసు వెనక్కి తిరిగి నడచి వీధి మొగిలో కొచ్చాడు. పెద్ద రస్తాలో తొందరగా నడిచిపోతున్నాడు. పార్కు దాటి, గుడిసెలు దాటి, కాలవ గట్టమ్మటే వెడుతున్నాడు, మొహాన తగిల్చిన గడ్డాలు పీకి, కాలవలో పారేశాడు. ఇంకా నడుస్తున్నాడు. ఇంకా దూరంగా మంచుతో, మసగగా కప్పబడిన ఆ పచ్చకొండ వేపుకి, దానవతలున్న వింత కేసి కదిలిపోయ్యాడు.